క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ఎంపీపీ

నక్కపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లు, యూనిఫాంలను ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీలు అందించారు. శుక్రవారం నక్కపల్లి ఎస్సీ కాలనీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని పంపిణీ చేశారు. స్కూళ్లు ప్రారంభమైన నాటికే ఈ కిట్లు సరఫరా చేశారని, తక్కువ రావడంతో పంపిణీలో జాప్యం జరిగిందన్నారు. నక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో కిట్లను టీడీపీ మండల అధ్యక్షుడు కె.వెంకటేష్, హెచ్ఎం పంపిణీ చేశారు. పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో ఎంఈవో కుంచం నరేష్, వార్డు సభ్యులు బంగార్రాజు, స్థానిక నాయకులు మీగడ సత్తిబాబు, కోసూరు శ్రీను, వెలగా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ కోసం చెట్ల నరికివేత



నీలిగుంట-పాములవాక రోడ్డులో విద్యుత్ లైన్ కోసం నరికేసిన చెట్లు

కోటవురట్ల: మండలంలో కొత్తగా వేస్తున్న విద్యుత్ లైన్ల కోసం చెట్ల నరికివేత కొనసాగుతోంది. ప్రతీ గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ పనులు ప్రారంభించింది. ఇందులో భాగంగా మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో విద్యుత్ లైన్ల కోసం స్తంభాలు ఏర్పాటు చేశారు. ఇందుకు అడ్డుగా ఉన్న చెట్లను ముందుగా తొలగిస్తున్నారు. ప్రస్తుతం నీలిగుంట-పాములవాక రహదారిలో చెట్ల నరికివేత జోరుగా సాగుతోంది.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న వార్డు సభ్యులు

నక్కపల్లి: మండలంలో ఎస్.నర్సాపురం పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని పలువురు వార్డు సభ్యులు, నాయకులు శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చిన నిధుల్లో అవకతవకలు జరిగాయన్నారు. తీర్మానాల్లో ఆమోదించిన పనులు కాకుండా తమకు నచ్చిన పనులను పాలకవర్గం ఆమోదం లేకుండానే సర్పంచ్ చేపట్టారని పేర్కొన్నారు, హెటిరోడ్రగ్స్ కంపెనీ నుంచి ఈ మూడేళ్ల కాలంలో సుమారు రూ.90 లక్షలు పన్నుల రూపంలో వసూలయిందని, ఈ నిధుల వినియోగంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు సభ్యులు నాగరత్నం, బాలాజీ, వీరబాబు, మాజీ ఎంపిటీసీ గణేష్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



కాకరాపల్లిలో చెరువు పనుల్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మునగపాక: ఉపాధి హామీ పథకాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎం.మన్మథరావు కోరారు. శుక్రవారం ఆయన మండలంలోని రాజుపేట, కాకరాపల్లి గ్రామాల్లో జరుగుతున్న చెరువు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు, కాలువలు, రహదారులు అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. పనిచేసే కాలానికి సకాలంలో వేతనాలు అందుతాయన్నారు. పని చేసే కూలీలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- పలు కీలక అంశాలకు ఆమోదం
- స్థానిక సమస్యలు ప్రస్తావించిన కౌన్సిలర్లు





మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, హాజరైన వార్డు కౌన్సిలర్లు

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో పేర్కొన్న 12 అంశాలను ఆమోదిస్తూ కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. వీటితోపాటు ఆఫీస్ పరంగా చర్యలు తీసుకోవాల్సిందిగా 2 అంశాలపై ఆమోదం తెలుపుతూ, మరి కొన్ని అంశాలపై రిమార్కులు కోరుతూ తీర్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు సత్య గుప్తా, సుంకర మరిణేశ్వరరావు, దూది నరసింహమూర్తి, పిట్టా సత్తిబాబు, మజ్జి రామకృష్ణ, దుంగా అచ్యుతరావు సహా పలు వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆమోదం పొందిన ప్రధానాంశాలు

- ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి గుర్రప్ప కల్యాణ మండపం వరకు యానాద్రి వరదనీటి కాలువలో పూడిక తొలగించేందుకు సాధారణ నిధులు రూ.5 లక్షలు కేటాయిస్తూ, ఈ పనిని యలమంచిలికి చెందిన తుమ్మపాల శ్రీనివాసరావుకు నామినేషన్‌పై కేటాయించారు.
- పట్టణంలో అన్న క్యాంటీన్ నిర్వహణకు వీలుగా ఆ భవనంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న తులసీనగర్, పాతవీధి వార్డు సచివాలయాలను పురపాలక సంఘ కార్యాలయంలోకి తాత్కాలికంగా మార్పు చేసేందుకు ఆమోదం తెలిపారు.
- పీవీ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో తులసీనగర్, పాతవీధి వార్డు సచివాలయాల నిర్మాణానికి చెరో రూ.8.75 లక్షలు కేటాయింపు.
- రూ.3.30 లక్షలతో పురపాలక సంఘం పరిధిలో పాడైన వీధి లైట్లను మార్చి, కొత్త లైట్లు బిగించేందుకు ఆమోదం.
- భారత సైనిక దళంలో పనిచేసి పదవీ విరమణ పొందిన 8 మందికి పన్ను మినహాయింపు ఇచ్చేందుకు తీర్మానించారు.
- అల్లూరి సీతారామరాజు కాలనీ, పెదపల్లి వార్డు సచివాలయాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు భవనాల్లో నిర్వహించేందుకు అవసరమైన అద్దె చెల్లింపునకు ఆమోదం.
- మున్సిపాలిటీ ప్రజారోగ్య విభాగంలో రూ.2 లక్షలతో పారిశుధ్య పనిముట్ల కొనుగోలు.
- ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మున్సిపాలిటీకి వచ్చిన ఆదాయం, ఖర్చు వివరాలు, ప్రస్తుతం బ్యాంకు అకౌంట్లలో ఉన్న నగదు నిల్వ, మున్సిపాలిటీ సాధారణ నిధులకు సంబంధించి రెండు ఖాతాల్లో ఉన్న రూ.2 కోట్ల 70 లక్షల 25 వేల 10 ఉన్నట్లు సభ్యులకు తెలిపారు.

సమస్యల ఏకరువు

సమావేశంలో భాగంగా పలువురు వార్డు కౌన్సిలర్లు తమ ప్రాంతాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రస్తావించారు.

- కొమ్మాయిగుండం చెరువు అభివృద్ధి పనులను 4 నెలల క్రితం అసంపూర్తిగా వదిలేశారని, సుమారు రూ.50 లక్షలతో చేపట్టిన పనులు ఎందుకూ పనికి రాకుండా నిరుపయోగమయ్యాయన్నారు. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి పనులు పూర్తి చేసి, ప్రజా వినియోగానికి తీసుకురావాల్సిందిగా మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్యగుప్తా కోరారు.
- హిందూ శ్మశానవాటిక వద్ద కాపలాదారుడ్ని నియమించాలని, అలా చేస్తే మృతుల వివరాలు ఎప్పటికప్పుడు తెలియడంతోపాటు, ఆయా కుటుంబాలకు త్వరితగతిన మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు వీలవుతుందన్నారు. దీన్ని పరిశీలించాల్సిందిగా అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు.
- యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు సక్రమంగా అందక, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు కొత్తపాలెం వార్డు కౌన్సిలర్ రాపేటి సంతోష్ సభ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం 9 గంటల్లోపు, రాత్రి 7 తర్వాత ఏవైనా కేసులు వస్తే వాటిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారని తెలిపారు. దీంతో అంత దూరం వెళ్లలేక స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరాల్సి వస్తోందని ఆక్షేపించారు.
- పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చేపల విక్రయాలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నిబంధనల మేరకు అక్కడ చేపల విక్రయాలను నిలిపేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును చైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశించారు.
- మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ ఇష్టారాజ్యంగా చేస్తున్నారని, కొమ్మలకు బదులు చెట్లనే నరికేస్తున్నారని కౌన్సిలర్ పందూరి హరినాథ్ ప్రస్తావించారు. కలపను వ్యాన్లపై తరలించి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సుమారు 50 చెట్లు నరికివేతకు గురయ్యాయన్నారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిల్ విద్యుత్ శాఖ ఏఈని వివరణ అడిగారు.
- మున్సిపాలిటీలో నీటి సరఫరాకు తరచూ ఆటంకం ఏర్పడుతోందని, 30 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ల నిర్వహణకు ఖర్చు తడిసిమోపెడవుతోందని సభ్యులు ప్రస్తావించారు. మున్సిపాలిటీ పరిధిలో అనధికార కుళాయి కనెక్షన్లను రూ.5,075 కట్టించుకుని క్రమబద్ధీకరించాలని సూచించారు.

ఫ్లెక్సీని తొలగించిన అధికారులు



నీలిగుంట పంచాయతీ కార్యాలయంపై టీడీపీ ఫ్లెక్సీని తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కోటవురట్ల: టీడీపీ నాయకుల బరితెగింపుపై అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని నీలిగుంట గ్రామంలో పంచాయతీ కార్యాలయంపై టీడీపీ నాయకులు తమ పార్టీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీనిపై సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ కార్యాలయంపై ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం వల్ల గ్రామంలో రెండు పార్టీల మధ్య వివాదాలు చోటుచేసుకుని శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని అధికారులకు సూచించారు. దీనిపై సాక్షిలో శుక్రవారం 'పంచాయతీపై టీడీపీ ఫ్లెక్సీ' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు స్పందించి, ఫ్లెక్సీని తొలగించారు. అధికారుల చర్యలకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రావెల్‌తో గొయ్యిని పూడ్చారు



అన్నవరం-వేములపూడి రహదారిలో గొయ్యిని గ్రావెల్‌తో పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కోటవురట్ల: అన్నవరం-వేములపూడి రహదారిలో ఉన్న ప్రమాద స్థితిపై 'రహదారిలో పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి పీఆర్ఆర్ అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి, గొయ్యిని గ్రావెల్‌తో పూడ్చి ప్రమాదాన్ని నివారించారు. దాంతో ఈ రహదారిలో ప్రయాణించే రైతులు, విద్యార్థులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. ఆ ఒక్క గొయ్యి పూడ్చివేతతో సరిపెట్టకుండా, రహదారిలో ఏర్పడిన పెద్ద పెద్ద గోతులన్నింటినీ పూడ్చి, ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

'మలాలాను స్ఫూర్తిగా తీసుకోవాలి'



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ మాణిక్యం

యలమంచిలి రూరల్: కొక్కిరాపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో శుక్రవారం అంతర్జాతీయ మలాలా దినోత్సవాన్ని నిర్వహించారు. ఏటా జూలై 12న మలాలా డేను ఎందుకు నిర్వహిస్తారో గురుకులం ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం విద్యార్థినులకు వివరించారు. ఉగ్రవాదంపై పోరాటం చేసి మహిళలకు చదువు, వారి హక్కులు కాపాడుకోవడం ఎంత అవసరమో ప్రపంచానికి అతి చిన్న వయసులోనే తెలిపి నోబెల్ శాంతి బహుమతిని పొంది మలాలా మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలిచినట్లు పేర్కొన్నారు. పాకిస్తానీ తాలిబన్లు బాలికలను చదువుకోకుండా అడ్డుకుంటూ చేస్తున్న దురాగతాలను ధైర్యంగా ఎదిరించి హక్కులను సాధించుకున్న ధీర వనితగా మలాలాను అభివర్ణించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం డైరెక్టర్ పి.సుజాత మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రతిభా పాటవాలు అంతర్లీనంగా దాగి ఉంటాయని, వాటిని ఉపయోగించుకుని ఉన్నత స్థానానికి ఎదగడం వారి చేతుల్లోనే ఉంటుందన్నారు. అనంతరం మలాలా గురించి ప్రసంగించిన బాలికలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంగీతం ఉపాధ్యాయురాలు హరిణి, ఇతర ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు

కోటవురట్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు సూచించారు. మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జీవో నెం.117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ధర్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేయడంలో ఏపీటీఎఫ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసు, ఉపాధ్యక్షుడు పడాల అప్పారావు, సీనియర్ నాయకులు ఇ.వి.రమణ, కృష్ణప్రసాద్, మండల శాఖ అధ్యక్షుడు సంగీత్‌రాజ్, ప్రధానకార్యదర్శి లోవరాజు, సభ్యులు జాన్‌సుధాకర్, సన్యాసిరావు, రాము పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



మెలిపాకలో డెంగ్యూ మాసోత్సవ ర్యాలీ



గంటవానిపాలెంలో దోమల నియంత్రణకు స్ప్రేయింగ్

మునగపాక: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెలిపాక సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కరరాజు కోరారు. మెలిపాకలో శుక్రవారం నిర్వహించిన డెంగ్యూ మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీజన్‌లో డెంగ్యూ సోకే ప్రమాదం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుర్రం శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు జి.లక్ష్మణ, ఎంఎల్‌హెచ్‌పీ యమునా లక్ష్మి, ఎం.శారద గంగాభవాని, ఎంపీహెచ్ఏ శరగడం అప్పలనాయుడు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. గంటవానిపాలెంలో డెంగ్యూ సోకకుండా దోమల నియంత్రణకు వైద్య సిబ్బంది స్ప్రేయింగ్ నిర్వహించారు.

పరశురామావతారంలో జగన్నాథుడు



జగన్నాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో జగన్నాథ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు శుక్రవారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం నుంచి జగన్నాథుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ నెల 17న ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడదాం



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సోమేశ్వరరావు



హాజరైన రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశంలో నేతల పిలుపు

యలమంచిలి రూరల్: పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. యలమంచిలి తాలూకా పెన్షనర్ల సంఘం సర్వ సభ్య సమావేశం శుక్రవారం పట్టణంలోని ఎన్‌జీవో హోమ్‌లో జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన సంఘం అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు ముందుగా వార్షిక నివేదిక చదివి వినిపించారు. అనంతరం సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వి.జగన్నాథరావు మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత అనకాపల్లి జిల్లా సంఘాన్ని బలోపేతం చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇందుకు సభ్యులంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. గత పీఆర్సీలో 70 ఏళ్లు, 75 ఏళ్లు నిండిన పెన్షనర్లకు నష్టం జరిగిందన్నారు. భవిష్యత్తులో సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. ప్రస్తుతం ఆరోగ్య బీమా కార్డులు పనిచేస్తున్నాయని తెలిపారు. అవసరమైన వారు ఉపయోగించుకోవాలని సూచించారు. పెన్షనర్ల సంక్షేమ సమితిలో సభ్యులుగా చేరితే కలిగే ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. గత ఏడాది కాలంలో మరణించిన పెన్షనర్లకు సంతాపం ప్రకటించారు. సీనియర్ పెన్షనర్లను సత్కరించారు. సమావేశంలో జిల్లా జనరల్ సెక్రటరీ ఎల్ఎన్ శర్మ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉన్నత భవిష్యత్తు



అరబుపాలెంలో విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించి, ఉత్తమ భవిష్యత్తును అందుకోవాలని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అరబుపాలెం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లితండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి జరిగాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంవై రాము, పీఎంసీ చైర్మన్ నెల్లిముఖి మహేష్, ఉప సర్పంచ్ దొడ్డి కృష్ణ, వార్డు సభ్యుడు పారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో నల్లమారమ్మ



శాకంబరీదేవిగా నల్లమారమ్మ తల్లి

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ రామాపూరం కాలనీలో కొలువైన నల్లమారమ్మ తల్లిని ఆలయ కమిటీ సభ్యులు ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరీ దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

తుమ్మపాల: ఎస్సీ, ఎస్టీ విద్యార్థి వసతి గృహాల్లో సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన జరిపి, వినతి పత్రం అందించారు. గత ఆరు నెలలుగా వసతి గృహాల బకాయిలకు, కేవలం రెండు నెలల నిధుల విడుదలకు చర్యలు ప్రారంభించారని, ఇలాంటి సమస్యలు విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారాయని ఆయా ప్రతినిధులు రాజాన దొరబాబు, శంకరరావు తెలిపారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్ కుమార్, భద్రం, విద్యార్థి నాయకుడు ఎ.ఫణీంద్ర, నగిరెడ్డి సత్యనారాయణ, మామిడి రమణ పాల్గొన్నారు.

పరశురాముడిగా జగన్నాథుడు



అనకాపల్లి: జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం స్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్నహాల్లో సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకుడు బంకుపల్లి సత్యనారాయణ నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు బొండా రాజేష్, మోహన్‌రావు, వెంకట చలపతిరావు, వెంకటవీర అప్పారావు, కోటేశ్వరరావు, ధనలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటిస్తే రోగాలు దూరం



సరుగుడులో రోగులను పరీక్షిస్తున్న నాతవరం వైద్యాధికారి రాజేష్‌నాయుడు



ఎం.బి.పట్నంలో రోగులను పరీక్షిస్తున్న గునుపూడి వైద్యాధికారి చక్రధర్ బలిజి

నాతవరం: వైద్యుల సూచనలు పాటిస్తే చాలా వరకు రోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎం.రాజేష్ నాయుడు, చక్రధర్ బలిజి తెలిపారు. నాతవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం సరుగుడులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడ 129 మందిని, గునుపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎం.బి.పట్నంలో 89 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం డెంగ్యూ, మలేరియాతోపాటు డయేరియా సోకకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామన్నారు. గిరిజన గ్రామాల్లో జ్వరాలు నివారించేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అందులో భాగంగానే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాచి చల్లార్చిన నీళ్లు తాగాలన్నారు. గునుపూడి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

నక్కపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. వేతనాలు ఇవ్వకపోయినా కూలీలంతా పొట్టకూటికోసం పనుల్లోకి వెళ్తున్నారన్నారు.

దాదాపు రెండు నెలల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. రోజువారి కూలిపై ఆధారపడి బతుకుతున్న కూలీలకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

యలమంచిలి రూరల్: పెదపల్లి ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం 9 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కొక్కిరాపల్లి, పెదపల్లి, రాంనగర్, ఎర్రవరం విద్యుత్ కనెక్షన్లు, శేషుకొండ కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ, మర్రిబంద, పాత ఎర్రవరం, రాంనగర్ ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాల్సిందిగా కోరారు.

ఇన్‌చార్జి ఎస్‌ఐగా రామకృష్ణ

మునగపాక: స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఐగా రామకృష్ణ నియమితులయ్యారు. ఇక్కడి ఎస్ఐగా పనిచేస్తున్న పి.ప్రసాదరావు ఐదు రోజులు సెలవుపై వెళ్లారు. దీంతో అనకాపల్లి ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణకు మునగపాక ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.